# పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్
- పోలింగ్ కేంద్రాల పరిశీలన



కృష్ణ మండలంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మాయంక్ మిట్టల్

కృష్ణ, అక్టోబర్ 14 : శాసనసభ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మయాంక్‌మిట్టల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మండల కేంద్రంతో పాటు గుడెబల్లూర్, మూడు మాల తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అధికారులు, ప్రజలతో మాట్లాడి పోలింగ్ కేంద్రాలోని సమస్యను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు తదితర వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో యశోదమ్మ, తాసీల్దార్ దయాకర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, ఎస్సై విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### అందుబాటులో ఉండాలి

మాగనూర్ అక్టోబర్ 14: అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండి పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. శనివారం మాగనూర్ మండలంలోని వడ్వాట్, అడవిసత్యారం, మందిపల్లి, కోల్పూర్, ఓబ్లాపూర్, మాగనూర్ పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతులు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తిం చాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు టెంట్లు, ర్యాంపులు ఏర్పాటుచేసి వారు కూర్చునే విధంగా కుర్చీలు ఇతర వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు పాటించి, రాజకీయాలకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలోఎంపీడీవో శశికళ, ఆర్ఐ శ్రీశైలం, ఎస్సై మల్లేశ్, ఎంపీవో జైపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ విలోక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు



పాత నేరస్తులను తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న పోలీసులు

అమరచింత, అక్టోబర్ 14: ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని లేకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తాసీల్దార్ షేక్‌చంద్ పాషా హెచ్చరించారు. సారా తయారీ వస్తువులను తరలిస్తూ పట్టుబడ్డ నలుగురిని శనివారం పోలీసులు తాసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే రూ.లక్ష జారిమానతో పాటు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ముగ్గురి బైండోవర్



తాసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేస్తున్న పోలీసులు

ఊట్కూర్, అక్టోబర్ 14: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శనివారం ముగ్గురు వ్యక్తులను తాసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. మండలంలోని వల్లంపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప, చిన్నపొర్ల గ్రామానికి చెందిన కోట్ల హన్మంతు, నర్సింహను తాసీల్దార్ కార్యాలయ రికార్డు అసిస్టెంట్ వెంకటేశ్ ఎదుట బైండోవర్ చేశారు. అనంతరం వారిని వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు కానిస్టేబుల్ విజయ్‌నాయక్ తెలిపారు. ఎన్నికల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల్లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, అక్టోబర్ 14: మండలంలోని ఆరెపల్లి, పిన్నెంచెర్ల, మూలమల్ల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతి, ర్యాంపు, గ్రిల్స్, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల కార్యదర్శులు ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల్లో పరిశుభ్రత పనులు చేపట్టారు. ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ , ఫ్యాన్స్ ఏర్పాటు, ర్యాంప్‌లు లేని కేంద్రాల వద్ద ర్యాంప్‌లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కార్యదర్శులకు సూచించారు.

# భక్తి శ్రద్ధలతో మహాలయ అమావాస్య

- కృష్ణానదిలో పుణ్యస్నానాలు
- పితృదేవతలకు తర్పణాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం



ఉమామహేశ్వర ఆలయంలో అన్నదానం చేస్తున్న సభ్యులు

మక్తల్,అక్టోబర్ 14: మండలంలోని పంచదేవ్‌పాహడ్ గ్రామంలో కృష్ణానది తీరంలో శనివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్య స్నానాలు ఆచరించి సమీప ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నదీ ఒడ్డున్న తమ పూర్వీకులను స్మరించుకొని పితృదేవతలకు పిండ తర్పణాలు సమర్పించారు. పంచదేవ్ పాహడ్ శ్రీపాద ఛాయ ఆశ్రమ పీఠాధిపతి శ్రీపతి స్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### ఉమామహేశ్వరాలయంలో అన్నదానం

మక్తల్ అర్బన్, అక్టోబర్ 14: పట్టణంలోని ఉమామహేశ్వరాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున 4:30 గంటలకు అర్చకులు సిద్ధరామయ్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహామంగళ హారతి అనంతరం ఉందేకోడ్ ఉమాదేవి, రవికుమార్ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బి.ఆంజనేయులు, పోలెపల్లి అనంత కుమా ర్, బి.శ్రీనివాసులు, చిన్న కృష్ణయ్య, నారా యణ రెడ్డి, వి.అంజయ్య, సీపీ.నవీన్, తిప్పిరెడ్డి, బి. నాగరాజు, పెద్ద బోయ వెంకటయ్య, గుడిగండ్ల శ్రీనివాస్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ఊట్కూర్ అయ్యప్ప శబరిమల పీఠంలో..

### అయ్యప్ప ఆలయంలో...

ఊట్కూర్, అక్టోబర్ 14: మండల కేంద్రంలోని అయ్యప్ప శబరిమల పీఠంలో శనివారం అమావాస్య సందర్భంగా గురుస్వామి రఘువీర్ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనం తరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, అయ్యప్ప సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నర్వ మండలంలో...

నర్వ అక్టోబర్ 14: మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం అమావస్యను పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాంపూర్ గ్రామ మఠంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## నేటి నుంచి నవరాత్రోత్సవాలు



మక్తల్,అక్టోబర్14: పట్టణంలోని నల్ల జానమ్మ ఆలయంలో విజయ దశమిని పురస్కరించుకుని ఆదివారం నుంచి ఈ నెల 23 వరకు దేవి శరన్నవ రాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నాగేందర్, ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు అమ్మవారికి అభిషేకం, 10 గంటలకు ఘటస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమౌతాయన్నారు. 16 వ తేదీ నుంచి 23 వరకు ప్రతి రోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో పాటు రాత్రి ఆలయంలో స్థానిక భజన మండలి భజన సంకీర్తనలు ఆలపిస్తారన్నారు. 21న దుర్గాష్టమి రోజూ అమ్మవారికి అలంకరణోత్సవం, 22న మహర్నవమి , 23న సాయంత్రం 6 గంటలకు పలకీ సేవ, అనంతరం శమి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవకు పాత్రులు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జుట్ల శంకర్, పాపిరెడ్డి కోరారు.

### కన్యకాపరమేశ్వరీ ఆలయంలో..

మక్తల్ అర్బన్,అక్టోబర్ 14: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం నుంచి ఈనెల 21వ తేదీ వరకు నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 7.30గంటలకు గణపతి ప్రార్థన, స్వస్తి పుణ్యావాచనం, ధ్వజారోహణం, కంకణధారణతో ఉత్సవాలు ప్రాంరంభ మవుతాయని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

## వర్కటంపై కేసు నమోదు

ఆత్మకూరు, అక్టోబర్ 14: వీజేఆర్ వ్యవస్థాపకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసు నమోదయ్యింది. మండలంలోని కత్తెపల్లి గ్రామంలో ఎస్సీ కుటుంబాలకు గతంలో రూ. 1.75 లక్ష లతో పంపిణీ చేసిన వ్యవసాయ సామాగ్రి మోటర్లు, పైప్‌లైన్, స్టాటర్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎన్నికల నియమావళి అమలులో ఉండగా వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించడం ఉల్లంఘనగా భావిస్తూ తాసీల్దార్ రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేందర్ తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉనందునా ఎవరైనా నిబంధన అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## ఘనంగా బతుకమ్మ సంబురాలు

ఊట్కూర్, అక్టోబర్ 14 : మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులు, కాలనీ మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో చిన్నారులు బుడి బుడి అడుగులు వేస్తూ బతుకమ్మ ఆటలతో ఆకట్టుకున్నారు. బతుకమ్మ అంటే తెలియని వయస్సులో అవగాహన కల్పిం చేందుకు కృషి చేసిన అంగన్‌వాడీ సిబ్బందిని కాలనీవాసులు అభినందించారు. కార్యక్రమంలో ఆయా అంజలమ్మ, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

